E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD  సంపుటి :01  సంచిక :213  సోమవారం 13 జూలై 2026  ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్  పేజీలు: 04  వెల :05/-

## తెలంగాణ టెట్ ఫలితాలు నేడే




కేటగిరీల వారీగా కటాఫ్ మార్కులు

టీచర్ నియామకాల్లో 20% వెయిటేజీ

1.15 లక్షల మంది అభ్యర్థులకు ఉత్కంఠ

## ఏపీలో మరో భారీ నిధి అత్యంత విలువైన 24 రకాల ఖనిజాలు




పీలేరులో 250 చ.కి.మీ విస్తీర్ణం

కోల్ ఇండియాకు అన్వేషణ బాధ్యత

రక్షణ రంగానికి కీలక వనరులు

త్వరలో మైనింగ్ సర్వేలు ప్రారంభం

# నీటి వివాదం మాటల యుద్ధం

రేవంత్‌పై హరీశ్ ఫైర్

నీళ్లపై మాటల యుద్ధం

కన్నెపల్లి నీళ్ల డిమాండ్

ప్రతిపక్షాలపై ఆగ్రహం

ఇంజినీర్ల నివేదిక విడుదల చేయాలి

దేవాదులపై ప్రశ్నలు

ఈగోతో నీళ్లు ఆపారన్న ఆరోపణ

భద్రాచలానికి ముప్పు లేదు

రైతుల కోసమే పోరాటం



**న్యూస్ డెస్క్, 12 జూలై (తెలుగు గళం):** సీఎం రేవంత్ రెడ్డిలో అధికారం కోల్పోబోతున్నామనే ఫ్రస్టేషన్ కనిపిస్తోందని అందుకే ప్రతిపక్షాల రక్తం పారించాలంటూ హింసను ప్రోత్సహించేలా మాట్లాడుతున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం మాటలు వింటే ఆయనలో ఒక సైకో కనిపిస్తున్నారని, హిట్లర్ తనకు ఆదర్శమని ఇప్పటికే చెప్పుకున్న రేవంత్ రెడ్డి వద్ద చెప్పడానికి విషయం లేకనే బూతులకు దిగుతున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డిలో శాడిస్ట్, బూతులు, అబద్ధాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని

షాబాద్ లో ఆరుగురిని హత్య చేసిన రాజ్ కుమార్ కు, సీఎంకు మధ్య తేడా లేదన్నారు. పొలాల్లో నీళ్లు పాలించమంటే బూతులు పారిస్తున్నారని మా రక్తం కావాలంటే తీసుకో కానీ రైతులకు నీళ్లు ఇవ్వాలన్నారు. కన్నెపల్లి మోటార్లు నొక్కమంటే ప్రతిపక్షాల గొంతు నొక్కుతామంటున్నారని మా రక్తం పారితేనే రైతులకు నీళ్లు ఇస్తామంటే రైతుల కోసం మా రక్తం ఇచ్చేందుకు కూడా సిద్ధమే అన్నారు. షాబాద్ ఘటనపై పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ఈ ఘటనపై స్పందించలేదన్నారు.

**వాస్తవాలు మాట్లాడితే జైల్లో పెడతానంటావా?:**

మొన్న కన్నెపల్లి వద్ద నీళ్లే లేవని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎన్డీఎస్ఏ చెప్పే వరకు నీళ్లు ఎత్తిపోయమని కొత్త రాగం అందుకున్నారని ఆరోపించారు. 31 నెలలు సీఎంగా ఉన్నా రేవంత్ కు విషయాలు అర్థం కావడం లేదన్నారు. కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోయవచ్చని రిటైర్డ్ ఇంజినీర్లు స్పష్టంగా చెప్పారు. రూ. ఎనిమిదిన్నర కోట్ల ఖర్చుతో చిన్న కాపర్ డ్యామ్ నిర్మించి ఎల్లంపల్లికి నీటిని తరలించవచ్చని ప్రభుత్వానికి తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్లు కూడా లేఖ రాశారు.

మిగతాది 2 లో..

## పేరు మార్చడం అన్యాయమే

మా పార్టీ పేరుకు పోలిక లేదు'

అభ్యంతరాల కాపీలు ఇవ్వాలి

పార్టీ గుర్తింపు ఇవ్వాలని విజ్ఞప్తి

ఈసీ నిర్ణయంపై అభ్యంతరం




**న్యూస్ డెస్క్, 12 జూలై (తెలుగు గళం):** తెలంగాణ రక్షణ సేన పార్టీకి గుర్తింపునివ్వాలని ఆ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. ఈనెల 7వ తేదీన ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు తాజాగా కేంద్ర ఎన్నికల కమిషన్‌కు కవిత రిప్లయ్ ఇచ్చారు. తెలంగాణ రక్షణ సేన ప్రధాన కార్యదర్శి హోదాలో అనిల్ కుమార్ ఆదివారం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌తో ఎన్నికల కమిషనర్‌లకు లేఖ రాశారు.కేంద్ర ఎన్నికల కమిషన్ తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరును తమకు కేటాయిస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 28న లేఖ ద్వారా సమాచారం ఇచ్చిందని తెలిపారు.కేంద్ర ఎన్నికల కమిషన్ తమకు తెలంగాణ రక్షణ సేన పార్టీ తమకు కేటాయించడంతో తెలంగాణ వ్యాప్తంగా 105 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ జెండాలు ఆవిష్కరించుకోవడంతో పాటు పార్టీ నిర్మాణ పరమైన ఇతర కార్యక్రమాలు చేపట్టామని వివరించారు.

## గానకోకిలకి తుది వీడ్కోలు

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

మైసూరులో అంతిమ సంస్కారాలు

గౌరవ వందనం సమర్పించిన పోలీసులు

కన్నీటి వీడ్కోలు పలికిన అభిమానులు

సంగీత లోకానికి తీరని లోటు




**న్యూస్ డెస్క్, 12 జూలై (తెలుగు గళం):** తన మధురమైన గొంతుతో దక్షిణ భారత సినీ సంగీత ప్రపంచాన్ని దశాబ్దాల పాటు ఓలలాడించిన లెజెండరీ ప్లేబ్యాక్ సింగర్, గానకోకిల ఎస్. జానకి (88) అంతిమ సంస్కారాలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. వయోభారంతో కూడిన అనారోగ్య సమస్యల కారణంగా శనివారం రాత్రి మైసూరులోని అపోలో ఆస్పత్రిలో ఆమె కన్నుమూసిన విషయం తెలిసిందే. జానకమ్మ భౌతిక కాయాన్ని అభిమానుల సందర్శనార్థం మైసూరులోని మహారాజా కాలేజీ గ్రౌండ్స్‌లో ఉంచగా.. సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు, వేలాది మంది అభిమానులు తరలి వచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు.దఅధికార లాంఛనాలతో

సంగీత ప్రపంచానికి ఆమె చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా కర్ణాటక ప్రభుత్వం ఎస్. జానకి అంత్యక్రియలను పూర్తి అధికార లాంఛనాలతో నిర్వహించింది.

## మళ్లీ జోరందుకోనున్న రుతుపవనాలు


రైతులకు ఊరట కలిగించే వార్త

జూలై 18-25 మధ్య భారీ వర్షాలు

బంగాళాఖాతంపై వాతావరణ ప్రభావం

ఐఎండీ నిశితంగా పర్యవేక్షణ

లోటు వర్షాలకు ముగింపు?




**న్యూస్ డెస్క్, 12 జూలై (తెలుగు గళం):** వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ ఇప్పటికీ దేశంలో లోటు వర్షపాతమే ఉంది. ఈ నేపథ్యంలో తాజా వార్త ప్రజలకు కాస్త ఊరట ఇస్తోంది. పశ్చిమ పసిఫిక్ మహాసముద్రంలో అనేక వాతావరణ వ్యవస్థలు అనుకూలమైన ప్రదేశాల్లో ఏర్పడుతున్నాయి. వీటిలో కొన్ని బంగాళాఖాతానికి చేరితే, రుతుపవనాలు మళ్లీ జోరందుకునే అవకాశం ఉంది. జూలై 18 నుంచి 25 మధ్య రుతుపవనాలు చురుకుగా మారి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వాతావరణ శాస్త్రవేత్తలు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు.

ఈ ఏడాది రుతుపవనాలు సాధారణంగానే ప్రారంభమైనప్పటికీ అనుకున్నంతగా దేశవ్యాప్తంగా వర్షాలు పడలేదు. తూర్పు ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. మధ్య, పశ్చిమ ప్రాంతాల్లో సరైన వర్షాలు లేక కరువు ఛాయలు అలుముకున్నాయి. దీని వల్ల ముఖ్యంగా వరి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు ప్రభావితమవుతున్నాయి.

## సీఎంకు బీజేపీ చీఫ్ లేఖ

కాళేశ్వరంపై మొండి వైఖరి వీడాలి

రైతుల కోసం నీటిని ఎత్తిపోసాలి

ఎన్‌డీఎస్‌ఏ నివేదిక అమలు చేయాలి

బ్యారేజీల పునరుద్ధరణకు డిమాండ్

రాజకీయాలు పక్కనపెట్టాలన్న బీజేపీ




**న్యూస్ డెస్క్, 12 జూలై (తెలుగు గళం):** కాళేశ్వరం పునరుద్ధరణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందంటూ తెలంగాణ రాష్ట్ర బీజేపీ చీఫ్ రామచందర్ రావు ఆరోపించారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. బ్యారేజీలను పునరుద్ధరణ పనులను కాంగ్రెస్ సర్కార్ గాలికి వదిలేసిందని లేఖలో దుయ్యబట్టారు. ఎన్డిఎస్ఏ సిఫారసులను సకాలంలో అమలు చేయకపోవడం వల్లే రైతులకు ఈ దుస్థితి వచ్చిందన్నారు.ఎన్డిఎస్ఏ ఇచ్చిన నివేదికను అడ్డుపెట్టుకుని సీఎం రేవంత్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, మేడిగడ్డలో నీటిని నిల్వ చేయకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోయవచ్చని రామచందర్ రావు తెలిపారు.

## 'నా గొంతును ఆపలేరు'

'ఇంకా దిగజారండి' అంటూ ఫైర్

అసత్య ప్రచారాలపై తీవ్ర విమర్శలు

'దిగజారండి.. ఇంకా దిగజారండి'


ఎంత అరచినా నన్ను ఆపలేరు

ప్రశ్న రావణ్‌కు మరోసారి మద్దతు

ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలపై చర్చ

2 లో

## రాష్ట్రంలో భూ ప్రకంపనలు నిద్రలో ఉలిక్కిపడిన ప్రజలు




విశాఖలో తెల్లవారుజామున భూప్రకంపనలు

రిక్టర్ స్కేల్‌పై 4.5 తీవ్రత నమోదు

నిద్రలోనే ఇళ్ల నుంచి బయటకు పరుగులు

విజయనగరంలోనూ కంపించిన భూమి

ఫ్యాన్లు, విద్యుదీపాలు ఊగడంతో భయం

భూకంపంతో అప్రమత్తమైన అధికారులు

## హైదరాబాదీలకు గుడ్‌న్యూస్




బుల్లెట్ ట్రైన్ కారిడార్లు

పుణే, చెన్నై, బెంగళూరుతో అనుసంధానం

రూ.5,400 కోట్ల రైల్వే బడ్జెట్

హైస్పీడ్ రైలు హబ్‌గా హైదరాబాద్

స్టేషన్ల ఆధునీకరణకు వేగం

త్వరలో బేగంపేట్ స్టేషన్ ప్రారంభం

**న్యూస్ డెస్క్, 12 జూలై (తెలుగు గళం):** హైదరాబాదీలకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ గుడ్‌న్యూస్ చెప్పారు. హైదరాబాద్‌ను దేశంలో కీలక హైస్పీడ్ రైలు (బుల్లెట్ ట్రైన్) హబ్‌గా అభివృద్ధి చేయనున్నట్లు అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. హైదరాబాద్‌ను పుణే, చెన్నై, బెంగళూరు నగరాలతో అనుసంధానించే మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లను కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిందని తెలిపారు. ఈ ప్రాజెక్టులు ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలను అనుసంధానించి తెలంగాణ అభివృద్ధికి కొత్త ఊపు తీసుకొస్తాయని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన HYSEA GCCS & IT రౌండ్‌టేబుల్ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి.. ప్రధాని మోడీ తెలంగాణ రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి రికార్డు స్థాయిలో రూ.5,400 కోట్ల బడ్జెట్ కేటాయించారని వెల్లడించారు.

మార్గాలివే..

హైదరాబాద్ కేంద్రంగా మూడు హైస్పీడ్ రైలు కారిడార్లను ప్రతిపాదించినట్లు అశ్విని వైష్ణవ్ తెలిపారు. పూణె - హైదరాబాద్, హైదరాబాద్ - చెన్నై, హైదరాబాద్ - బెంగళూరు ఈ మూడు మార్గాలు అమల్లోకి వస్తే హైదరాబాద్ దక్షిణ భారతదేశంలో ప్రధాన హైస్పీడ్ రైలు కేంద్రంగా మారుతుందని...

## వియత్నాంలో ఘోర బోటు ప్రమాదం

15 మంది భారతీయులు మృతి

21 మందిని సురక్షితంగా రక్షింపు

బలమైన గాలులతో ప్రమాదం

వియత్నాం ప్రభుత్వ సంతాపం

ప్రమాదంపై దర్యాప్తుకు ఆదేశాలు

2 లో

# నీటి వివాదం.. మాటల యుద్ధం

మొదటి పేజీ తరువాయి

ఆ లేఖ బయటపెట్టాలన్నారు. రిటైర్ట్ ఇంజినీర్లను జైల్లో పెడతానంటావ్, ప్రశ్నించిన ప్రస్తుత ఇంజినీర్లపై ఏసీబీలతో దాడులు చేయిస్తున్నారు. ప్రతిపక్షాలను రక్షం పారిస్తానంటున్నారు. ఇది రాష్ట్రానికి ఉపయోగపడుతుందా అని ప్రశ్నించారు. కన్నెపల్లి, దేవాదుల, సీతారామా ప్రాజెక్టుల్లో నుంచి ఎత్తిపోస్తే పట్టిసీమకు నీళ్లు ఎక్కడివి అని ప్రశ్నించారు. దేవాదులలో 10 మోటర్లు ఉంటే నాలుగు మాత్రమే ఎందుకు నడుపుతున్నారని ప్రశ్నించారు. ఇక్కడ పండబెట్టి ఎన్డీఎస్ఏ అని డ్రామాలు ఆడుతున్నారు. దేవాదులలో ఏ ఎన్డీఎస్ఏ అడ్డం వచ్చిందని ప్రశ్నించారు. ఇంత జరుగుతుంటే నిద్రపోతున్నావా? గాడిద పళ్లు తోముతున్నావా? లేక పందులుకాస్తున్నావా అని ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. నీకే కాదు నాకూ మాట్లాడవచ్చు. కానీ సంస్కారం అడ్డువస్తుందన్నారు.

చూస్తూ ఊరుకునేది లేదు:

రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా నీళ్లు ఎత్తిపోయాలని ఇంత మంది చెబుతున్నా నీళ్లు ఎత్తిపోస్తే ఇంత కాలం బీఆర్ఎస్ పై తాము చేసిన ప్రచారం అవాస్తవం అని ప్రజలకు అర్థం అవుతుందనే కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోయడం లేదన్నారు. రేవంత్ రెడ్డి తన ఈగో వల్లే నీటిని ఎత్తిపోయడం లేదన్నారు. 20 ఏళ్లుగా ఎల్లంపల్లి ప్రాజెక్టు నడుస్తోందని రేవంత్ రెడ్డి అబద్ధాలు మాట్లాడారని ముఖ్యమంత్రి కుర్చీలో ఉన్నంత మాత్రాన ఏది మాట్లాడితే నడువదన్నారు. బీఆర్ఎస్ హాయంలోనే ఎల్లంపల్లి పూర్తయిందన్నారు. ప్రజలు అన్ని గమిస్తున్నారన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు మీద హైదరాబాద్ సహా అనేక జిల్లాలతో పాటు ఎల్లంపల్లి మీద ఆధారపడి రామగుండం థర్మల్, ఎన్టీపీసీ, సింగరేణికి ఈ ప్రాజెక్టు నుంచే నీళ్లు కావాల్సి ఉందన్నారు. నీళ్ల విషయంలో ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తానంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

భద్రాచలంకు ముప్పులేదు:

అన్నారం, సుందిళ్ల గేట్లు మూసేస్తే భద్రాచలం కొట్టుకుపోతదని సీఎం పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని కానీ 2022 లో 28లక్షల క్యూసెక్కుల వరద నీళ్లు వచ్చింది. గతేడాది 15 లక్షల క్యూసెక్కుల మేడిగడ్డ తట్టుకుని నిలబడింది. అయినా భద్రాచలంకు, ఆ 40 గ్రామాలకు ఏమి జరగలేదు. అన్నారం, సుందిళ్ళ రెండింటిలో కలిపి నింపేది 10 టీఎంసీలేనని ఇవి రెండు కలిపి ఒకేసారి కిందకు వెళ్లినా ఏమి జరగదన్నారు. దేవాదుల వద్ద పూర్తి స్థాయిలో మోటార్లు ఎందుకు నడవడం లేదు అని మండిపడ్డారు.

# పేరు మార్చడం అన్యాయమే

మొదటి పేజీ తరువాయి

కేంద్ర ఎన్నికల కమిషన్ జూన్ 23న తమకు లేఖ రాస్తూ తెలంగాణ రక్షణ సేన పార్టీ రిజిస్ట్రేషన్‌పై సుమారు వెయ్యి అభ్యంతరాలు వచ్చాయని పేర్కొన్నారని వివరించారు. కానీ ఇంత వరకు ఆ అభ్యంతరాల్లో ఒక్కటి కూడా తమకు పంపలేదని తెలిపారు. అభ్యంతరాలు ఎవరు తెలిపారు?, ఆయా అభ్యంతరాల్లో ఏమి పేర్కొన్నారు?, అనే వివరాలు కూడా ఇవ్వలేదన్నారు. అసలు అభ్యంరాతలనే తమకు పంపకుంటే తాము సమాధానం ఎలా చెప్పగలమని అన్నారు.

మాకు తీవ్ర నష్టం, అన్యాయం చేసినట్లే..

తెలంగాణ రాష్ట్ర జనాభా మూడున్నర కోట్లు అని.. వెయ్యి అభ్యంతరాలు వచ్చాయనే సంఖ్యను చూపిస్తూ ఈసీ నిర్ణయం సరికాదన్నారు. అసలు అభ్యంతరాల వెనుక లీగల్ మెరిట్ ఏంటి అనేది పరిశీలించాలి? ఎవరైనా కావాలనే గ్రూపులుగా ఏర్పడి, ప్లాన్ ప్రకారం ఇదంతా చేయించారా? అనేది తమకు అబ్జెక్షన్ కాపీలు ఇస్తేనే తెలుస్తుంది. ఈసీ ఆమోదించిన పేరును నమ్ముకొని సంస్థాగతంగా పార్టీ బలోపేతం చేసుకున్నామని.. ఇప్పుడు ఆ పేరును మార్చుకోవాలని అంటే అది తమకు తీవ్ర నష్టం, అన్యాయం చేసినట్లు అవుతుందని తెలిపారు. ఢిల్లీ హైకోర్టు ఆదేశించినట్టుగా తాము ఈసీ ఎదుట వ్యక్తిగత విచారణ హాజరవాడానికి ముందే తమ పార్టీపై వచ్చిన అన్ని అభ్యంతరాల కాపీలను ఇవ్వాలని కోరారు. అప్పుడు మాత్రమే తాము సరైన సమాధానం చెప్పుకునే అవకాశం కలుగుతుందన్నారు. ప్రతిపాదిత "తెలంగాణ రక్షణ సేన" అనే పేరును మేము పూర్తి సదుద్దేశంతో స్వతంత్రంగా ఆలోచించి పెట్టిన పేరు అని వివరించారు. "తెలంగాణ రక్షణ సేన" అనే పేరుతో దేశంలో మరే ఇతర రాజకీయ పార్టీ కూడా నమోదు కాలేదని.. ఇది ఏ గుర్తింపు పొందిన లేదా నమోదైన రాజకీయ పార్టీ పేరును పోలి లేదని అన్నారు. రెండు పార్టీల పేర్ల మధ్య పోలికలను నిర్ధారించుకునేప్పుడు రాజకీయ పార్టీ యొక్క పూర్తి పేరును ఒకే సమగ్ర రూపంగా భావించాలని.. కానీ అందులోని విడి పదాలను ముక్కలు చేసి లేదా విడదీసి చూడకూడదన్నారు.

మా పార్టీ పేరుకు ఏ పార్టీతోనూ పోలిక లేదు..

ఎన్నికల కమిషన్ తమకు పంపిన అభ్యంతరాల్లోని "తెలంగాణ రక్షణ సమితి (డెమోక్రాటిక్) (2024)", "తెలంగాణ రాజ్య సమితి" (2023) అనేవి వేర్వేరు పేర్లు.. విభిన్న ఉచ్చారణ, నిర్మాణం, గుర్తింపు, నాయకత్వం, సంస్థాగత శైలి తో పాటు ప్రజల్లో వేర్వేరు గుర్తింపు కలిగిన రాజకీయ పేర్లు అని వివరించారు. ఆ పేర్లతో "తెలంగాణ రక్షణ సేన"ను దాని సమగ్ర రూపంలో పరిశీలించినప్పుడు, అది పూర్తి భిన్నంగా, స్పష్టంగా గుర్తించదగిన రాజకీయ పార్టీగా తెలుస్తోందన్నారు.. ప్రస్తుతం ఉనికిలో ఉన్న ఏ గుర్తింపు పొందిన లేదా నమోదైన రాజకీయ పార్టీతోనూ తమ పార్టీ పేరుకు పోలిక లేదన్నారు. గతంలో కూడా కేవలం ఒకే రకమైన భౌగోళిక వర్ణనాత్మక, సిద్ధాంతపరమైన పదాలు ఉన్నాయనే కారణంతో పార్టీ రిజిస్ట్రేషన్ నిరాకరించిన దాఖలాలు కూడా లేవని వివరించారు. ఒకే విధమైన పదాలతో సమాంతరంగా వేర్వేరు రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలు దేశంలో వందల్లో ఉన్నాయని తెలిపారు. ఆమ్ ఆద్మీ, అఖండ్ భారత్, మక్కల్, ప్రజా సేవ, జన్ అధికార్, రాష్ట్రీయ జనతా, డెమెక్రాటిక్, సోషల్, రిపబ్లిక్ ఇండియా, శిరోమణి లాంటి పేర్లతో వందలాది పార్టీలు రిజిస్ట్రేషన్ పొంది ఉన్నాయన్న విషయం పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ గుర్తింపునిచ్చిన ఒకే విధమైన పేర్లు ఉన్న పార్టీల జాబితాను లేఖకు జత చేశారు. "తెలంగాణ రక్షణ సేన" పార్టీ పేరుపై వచ్చిన అన్ని అభ్యంతరాల కాపీలను, అలాగే తమకు వ్యతిరేకంగా ఉపయోగించాలనుకుంటున్న అన్ని ఆధారాలను తమకు అందజేయాలని కోరారు.

అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి, సమాధానం ఇవ్వడానికి తమకు తగినంత సమయం ఇచ్చాకే.. వ్యక్తిగత విచారణకు పిలవాలని విజ్ఞప్తి చేశారు. ఆ వివరాల వెల్లడి తర్వాత తమ వాదనలను సమర్థవంతంగా వినిపించడానికి, అభ్యంతరాలకు సరైన సమాధానం ఇవ్వడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. కేవలం సాధారణ భౌగోళిక వర్ణానాత్మక ఉనికిని బట్టి, ఊహాజనిత సంక్షిప్త రూపాల ఆధారంగా వచ్చిన అభ్యంతరాలన్నింటినీ తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు. చట్టప్రకారం నిష్పాక్షికమైన, హేతుబద్ధమైన పూర్తి కారణాలతో కూడిన స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 29ఏ కింద ప్రతిపాదిత "తెలంగాణ రక్షణ సేన" పార్టీ గుర్తింపు కోసం తాము చేసుకున్న దరఖాస్తును పరిశీలించి, ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు.

# సీఎంకు బీజేపీ చీఫ్ లేఖ



**న్యూస్ డెస్క్, 12 జూలై (తెలుగు గళం):** కాళేశ్వరం పునరుద్ధరణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందంటూ తెలంగాణ రాష్ట్ర బీజేపీ చీఫ్ రామచందర్ రావు ఆరోపించారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. బ్యారేజీలను పునరుద్ధరణ పనులను కాంగ్రెస్ సర్కార్ గాలికి వదిలేసిందని లేఖలో దుయ్యబట్టారు. ఎన్డిఎస్ఏ సిఫారసులను సకాలంలో అమలు చేయకపోవడం వల్లే రైతులకు ఈ దుస్థితి వచ్చిందన్నారు. ఎన్డిఎస్ఏ ఇచ్చిన నివేదికను అడ్డుపెట్టుకుని సీఎం రేవంత్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, మేడిగడ్డలో నీటిని నిల్వ చేయకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోయవచ్చని రామచందర్ రావు తెలిపారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి రాజకీయాలు పక్కనపెట్టి.. ప్రజల కోసం కాళేశ్వరం నీటిని వినియోగంలోకి తీసుకురావాలని లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ అసమర్థత వల్ల రైతులు నష్టపోతున్నారని, కరువు కాలంలో గోదావరి నీటిని వాడుకోలేక నష్టపోతున్నామని వాపోయారు. ఎన్డిఎస్ఏ నివేదికల అమలులో అలసత్వం చేస్తున్నారని, కేంద్ర కమిటీపై నెపాన్ని నెట్టి తప్పించుకోవద్దని సూచించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీలను త్వరలో పునరుద్ధరించాలని కోరారు.

# రాష్ట్రంలో భూ ప్రకంపనలు

**న్యూస్ డెస్క్, 12 జూలై (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్ వాసులకు బిగ్ అలర్ట్. విశాఖలో ఆదివారం తెల్లవారుజామున భూప్రకంపనలు సంభవించాయి. విశాఖలోని మాధవధార, సీతమ్మధార, గాజువాక, పెదవాల్తేరు, ఈస్ట్ పాయింట్ కాలనీలతో పాటు పలు ప్రాంతాలలో భూమి కనిపించింది. దీంతో నిద్రలో ఉన్న జనాలు.. భయపడి ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఏం జరుగుతుందో అర్థంకాక అయోమయానికి గురయ్యారు. ఇళ్లలో ఫ్యాన్లు ఊగడం, వీధిలైట్లు మిణుకుమిణుకుమంటూ కనిపించడంతో ఆందోళన చెందారు. కాలనీవాసులందరూ ఒకే దగ్గరకు చేరి.. భూ ప్రకంపనలపై ఆరా తీశారు. అధికారులకు కూడా సమాచారం అందించారు. రిక్టర్ స్కేల్ పై భూకంపం తీవ్రత 4.5 గా నమోదు అయినట్టు తెలుస్తోంది. అటు విజయనగరం జిల్లాలోనూ పలు చోట్ల భూమి కంపించినట్లు సమాచారం. దీంతో అక్కడి ప్రజలు కూడా అలర్ట్ అయ్యారు.

# గానకోకిలకి తుది వీడ్కోలు

మొదటి పేజీ తరువాయి

పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం మైసూరు సమీపంలోని కనియనహుండి వద్ద జానకమ్మ మనవరాల్ అప్సర, కుటుంబ సభ్యుల సమక్షంలో సాంప్రదాయబద్ధంగా అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. ఆమె మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఇరు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సినీ పరిశ్రమకు చెందిన చిరంజీవి, కమల్ హాసన్, రజనీకాంత్ తదితర అగ్రనేతలు తమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. జానకమ్మ భౌతికంగా మన మధ్య లేకపోయినా.. ఆమె పాడిన వేలాది పాటల రూపంలో అమరులుగానే ఉంటారని సంగీతాభిమానులు స్మరించుకుంటున్నారు.

# వియత్నాంలో ఘోర బోటు ప్రమాదం



**న్యూస్ డెస్క్, 12 జూలై (తెలుగు గళం):** వియత్నాంలో ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన ఫు క్వాక్ ద్వీపం సమీపంలో భారతీయ పర్యాటకులతో వెళ్తున్న ఒక స్పీడ్‌బోట్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 15 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమయంలో బోటులో 32 మంది భారతీయ ప్రయాణికులతో పాటు నలుగురు స్థానిక సిబ్బంది ఉండగా, వారిలో 21 మందిని రక్షించారు. మృతులలో 10 మంది తమిళనాడుకు, ముగ్గురు ఆంధ్రప్రదేశ్‌కు, ఇద్దరు కేరళకు చెందిన వారు ఉన్నట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఒక మొబైల్ కంపెనీ స్పాన్సర్ చేసిన టూర్‌లో భాగంగా విహారయాత్రకు వెళ్లిన వీరంతా తిరిగి వస్తుండగా బలమైన గాలుల కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

ఈ ఘోర విషాదం పై వియత్నాం అగ్రనేతలు, ప్రెసిడెంట్ తో లామ్, ప్రధానమంత్రి లే మిన్ హంగ్ స్పందిస్తూ.. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై వియత్నాం ప్రభుత్వం సమగ్ర దర్యాప్తునకు ఆదేశించింది. మరోవైపు, బాధితుల కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని అందించడం, గాయపడిన వారికి వైద్య సేవలు అందించడంతో పాటు, మరణించిన వారి భౌతిక కాయాలను వీలైనంత త్వరగా భారతదేశానికి తరలించేందుకు హనోయ్‌లోని భారత రాయబార కార్యాలయంతో కలిసి వియత్నాం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ప్రకటించారు.

# హైదరాబాదీలకు గుడ్‌న్యూస్..

మొదటి పేజీ తరువాయి

ఆయా ప్రాంతాల ఆర్థిక వ్యవస్థలు పరస్పరం మరింత అనుసంధానమవుతాయని పేర్కొన్నారు. తెలంగాణలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ.5,400 కోట్లు కేటాయించిందని తెలిపారు. ఈ నిధులతో రాష్ట్రంలో రైల్వే రంగంలో భారీ మార్పులు చోటుచేసుకుంటాయని చెప్పారు. అలాగే కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ తయారీ ప్రోత్సాహక పథకాల వల్ల తెలంగాణకు విశేష ప్రయోజనం చేకూరిందన్నారు. ఇప్పటివరకు 100కు పైగా ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థలు కేంద్ర పథకాల కింద ప్రోత్సాహం పొందాయని వివరించారు.

దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్ల ఆధునీకరణ కార్యక్రమం వేగంగా కొనసాగుతోందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇప్పటివరకు 261 రైల్వే స్టేషన్ల పునర్నిర్మాణం పూర్తయిందని చెప్పారు. ఈ ఏడాది చివరి నాటికి 400 స్టేషన్లు, వచ్చే ఏడాది చివరి నాటికి 700 స్టేషన్ల ఆధునీకరణ పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఇక సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ పనులు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలగకుండా కొనసాగుతున్నాయని తెలిపారు. అన్ని ప్లాట్‌ఫారమ్‌లపై భారీ ఎయిర్ కాన్‌కోర్స్ నిర్మిస్తున్నామని, రైళ్లు నడుస్తూనే అత్యంత జాగ్రత్తగా ఈ పనులు చేపడుతున్నామని చెప్పారు. భద్రత, నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.

బేగంపేట్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పూర్తయిందని.. త్వరలో ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు అశ్విని వైష్ణవ్ తెలిపారు. అలాగే హైటెక్ సిటీ, వరంగల్, కరీంనగర్ రైల్వే స్టేషన్ల పనులు కూడా పూర్తయ్యాయని చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్ (నాంపల్లి), కాజీపేట్ జంక్షన్, మలక్‌పేట్ రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. స్వాతంత్ర్యం తర్వాత రైల్వే స్టేషన్లలో కేవలం పెయింటింగ్‌లు, చిన్నపాటి మరమ్మతులకే పరిమితమయ్యారని, కానీ ప్రధాని నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా 1,300 రైల్వే స్టేషన్లను పూర్తిగా పునర్నిర్మించే లక్ష్యాన్ని చేపట్టారని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం భారత రైల్వే చరిత్రలో అతిపెద్ద ఆధునీకరణ ప్రాజెక్టుగా నిలుస్తుందని అన్నారు.

# తెలంగాణ టెట్ ఫలితాలు నేడే..




**న్యూస్ డెస్క్, 12 జూలై (తెలుగు గళం):** తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష రాసిన అభ్యర్థులకు బిగ్ అలర్ట్. సోమవారం మధ్యాహ్నం 02:30 గంటలకు టెట్ ఫలితాలు విడుదల అవుతాయని సమాచారం. ఫలితాలు విడుదలైన వెంటనే అభ్యర్థులు ఎలాంటి ఇబ్బంది లేకుండా తమ మొబైల్ లేదా కంప్యూటర్ ద్వారా సులభంగా మార్కులను చూసుకోవచ్చు. అభ్యర్థుల సౌకర్యార్థం విద్యాశాఖ ప్రత్యేకంగా అధికారిక పోర్టలు అందుబాటులో ఉంచింది. అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్ సహాయంతో అధికారిక వెబ్సైట్ https://tgtet.aptonline.in లో లాగిన్ అయి ఫలితాలను డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఈసారి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 115,028 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు.

కేటగిరీల వారీగా క్వాలిఫైయింగ్ మార్కులు..

ఓసీ అభ్యర్థులు: కనీసం 60 శాతం మార్కులు సాధించాలి. అంటే 150 మార్కులకు గానూ 90 మార్కులు రావలసి ఉంటుంది.

బీసీ అభ్యర్థులు: కనీసం 50 శాతం మార్కులు సాధించాలి. అంటే 75 మార్కులు వస్తేనే అర్హత సాధించినట్లు ప్రకటిస్తారు.

ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు: కనీసం 40 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. అంటే 150 మార్కులకు గానూ 60 మార్కులు సాధిస్తే సరిపోతుంది.

టెట్‌లో సాధించిన మార్కులకు ఉపాధ్యాయ నియామకాల్లో 20 శాతం వెయిటేజీ ఉంటుంది. ఉపాధ్యాయ ఉద్యోగమే లక్ష్యంగా ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు టెట్ మార్కులు అత్యంత కీలకం. ఈ టైట్‌లో సాధించిన మార్కులకు రాబోయే ఉపాధ్యాయ నియామకాల్లో 20 శాతం వెయిటేజీ ఉంటుంది. కాబట్టి ఇందులో మంచి స్కోర్ సాధించడం అభ్యర్థుల ఉద్యోగ అవకాశాలను మరింత మెరుగుపరుస్తుంది.

# ఏపీలో మరో భారీ నిధి

## అత్యంత విలువైన 24 రకాల ఖనిజాలు




**న్యూస్ డెస్క్, 12 జూలై (తెలుగు గళం):** ఏపీలో మరో ఖనిజ నిధి ఉన్నట్లు వెల్లడైంది. దీంతో వెలికితీసేందుకు ఏర్పాట్లు జరుగుతోంది. ఈ ఖనిజ నిధి కూడా రాయలసీమలోనే ఉండటం విశేషం. ఇప్పటికే కర్నూలు జిల్లా జొన్నగిరిలో భూగర్భంలో దాగి ఉన్నట్లు బంగారాన్ని వెలికిస్తున్నారు. ఇప్పుడు ఇదే సీమలో మరోచోట కూడా ఖనిజ వనరు ఉండటంతో వెలికితేసేందుకు కేంద్రం ప్రభుత్వం వేగంగా అడుగులు వేసింది.

పీలేరు నియోజకవర్గం ఒంటెల్లులో ఏకంగా..

అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం ఒంటెల్లులోని చంద్రగిరి బ్లాక్‌లో ఏకంగా 250 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో క్రిటికల్ రేర్ ఎర్త్ మినరల్స్ ఉన్నాయి. ఈ విషయాన్ని ఇప్పటికే కేంద్రగనుల శాఖ నిర్ధారించింది. దీంతో ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా ఈ భారీ అన్వేషణ లెసెన్స్ దక్కించుకుంది. రక్షణ రంగం ఎలక్ట్రానిక్స్ తయారీకి ఉపయోగపడే 24 రకాల అత్యంత విలువైన ఖనిజాలు ఇక్కడ ఉన్నట్లు అటు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా తేల్చింది. దీంతో ఈ భూగర్జ ఖనిజాలను వెలికితీసేందుకు వేట ప్రారంభించనుంది.

ఏడాదిలోపు మైనింగ్ ఒప్పందాలు పూర్తి చేసుకుని...

రాష్ట్ర ప్రభుత్వం నుంచి లెటర్ ఆఫ్ ఇంటెంట్ అందిన వెంటనే ఏడాదిలోపు మైనింగ్ ఒప్పందాలు పూర్తి చేసుకుని క్షేత్ర స్థాయిలో సర్వే పనులను వేగవంతం చేసేందుకు కోల్ ఇండియా సంస్థ సిద్ధమవుతోంది. ఈ ఖనిజాన్వేషణ మొత్తం మూడు దశల్లో చేపట్టనున్నారు. జీ3, జీ4 స్థాయిలో జియోలాజికల్ మ్యాపింగ్ భూగర్భ సర్వేలు నిర్వహిస్తారు. ఈ 250 చదరపు కిలో మీటర్ల పరిధిలో పలు చోట్ల అటవీ ప్రాంతాలు, కొండలు ఉండటంతో కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నుంచి స్టేజ్ వన్ ఫారెస్ట్ క్లియరెన్స్ తీసుకుంటున్నారు. సర్వే ప్రారంభించే ముందు అన్నమయ్య, తిరుపతి కలెక్టర్ల నుంచి అనుమతి తీసుకుంటారు. వీటితో పాటురెవెన్యూ, మైనింగ్ అధికారుల సమక్షంలో సరిహద్దులను గుర్తిస్తారు. అన్ని అనుమతుల తర్వాత ఖనిజాలు వెలికితీయనున్నారు.


# 'నా గొంతును ఆపలేరు'



**న్యూస్ డెస్క్, 12 జూలై (తెలుగు గళం):** తన ప్రశ్నించే గొంతును ఎవరూ ఆపలేరని నటుడు ప్రకాష్ రాజ్ అన్నారు. తాను మౌనంగా లేనని అన్నీ చూస్తున్నానని చెప్పారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు వారి ఇన్ఫ్లుయెన్స్ తో జనసైనికులు, కొందరికి అమ్ముడుపోయిన జనసైనికులు యూట్యూబర్లు చేస్తున్న అసత్యప్రచారాలు వింటున్నానని అన్నారు. మీ అందరికీ నా సమాధానం ఇదేనని.. దిగజారండి.. ఇంకా దిగజారండి అంటూ ఎద్దేవా చేశారు. ప్రపంచం మొత్తం చూస్తుందని, దిగజారడంలో మీకు మీరే సాటి అని చెప్పేలా దిగజారండి అంటూ మండిపడ్డారు.

కాస్త గట్టిగా దిగజరండి.. అరుస్తూ దిగజారండి అంటూ మండిపడ్డారు. మీరు ఎంత అరిచినా ఎన్ని కథలు చెప్పినా తన లాంటి ప్రశ్నించే గొంతులను ఆపలేచని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే ప్రకాష్ రాజ్ గతకొద్దిరోజులుగా వార్తల్లో నిలుస్తున్న సంగతి తెలిసిందే. ప్రశ్న రావణ్ ను పోలీసులు అరెస్ట్ చేసిన నాటి నుండి ప్రకాష్ రాజ్ ఆయనకు మద్దతుగా నిలుస్తూ వీడియోలు చేస్తున్నారు. రావణ్‌ను అక్రమ అరెస్ట్ చేశారంటూ ప్రకాష్ రాజ్ ఆరోపిస్తున్నారు. దీంతో ప్రకాష్ రాజ్ పై సైతం కొందరు విమర్శలు చేస్తూ వీడియోలు చేస్తున్నారు.

# మళ్లీ జోరందుకోనున్న రుతుపవనాలు



**న్యూస్ డెస్క్, 12 జూలై (తెలుగు గళం):** వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ ఇప్పటికీ దేశంలో లోటు వర్షపాతమే ఉంది. ఈ నేపథ్యంలో తాజా వార్త ప్రజలకు కాస్త ఊరట ఇస్తోంది. పశ్చిమ పసిఫిక్ మహాసముద్రంలో అనేక వాతావరణ వ్యవస్థలు అనుకూలమైన ప్రదేశాల్లో ఏర్పడుతున్నాయి. వీటిలో కొన్ని బంగాళాఖాతానికి చేరితే, రుతుపవనాలు మళ్లీ జోరందుకునే అవకాశం ఉంది. జూలై 18 నుంచి 25 మధ్య రుతుపవనాలు చురుకుగా మారి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వాతావరణ శాస్త్రవేత్తలు పరిస్థితినిని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు.

ఈ ఏడాది రుతుపవనాలు సాధారణంగానే ప్రారంభమైనప్పటికీ అనుకున్నంతగా దేశవ్యాప్తంగా వర్షాలు పడలేదు. తూర్పు ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. మధ్య, పశ్చిమ ప్రాంతాల్లో సరైన వర్షాలు లేక కరువు ఛాయలు అలుముకున్నాయి. దీని వల్ల ముఖ్యంగా వరి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు ప్రభావితమవుతున్నాయి. జలాశయాల నీటిమట్టాలు కూడా తగ్గిపోతున్నాయి, ఇది తాగునీరు మరియు సాగునీటికి ఆందోళన కలిగిస్తోంది.

వాతావరణ శాఖ చెబుతున్న దాని ప్రకారం.. రుతుపవన ద్రోణి తన సాధారణ స్థానం నుంచి పక్కకు జరగడంతో తగినంత తేమతో కూడిన గాలులు ఈ ప్రాంతానికి చేరడం లేదు. ఈ నేపథ్యంలో పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణమండల వ్యవస్థలు లేదా అల్పపీడన వ్యవస్థలు ఏర్పడుతున్నాయి. ఈ వ్యవస్థలు పశ్చిమం వైపు కదిలి భారత దేశానికి సమీపంలోని బంగాళాఖాతంలోకి ప్రవేశిస్తే అవి రుతుపవనాలను బలోపేతం చేస్తాయి. జుజవీఔఖీ, +ఖీూ, ×వీణ వంటి అంతర్జాతీయ, భారతీయ వాతావరణ సంస్థలు కూడా ఇదే అవకాశాన్ని సూచిస్తున్నాయి.

ఉత్తర భారతదేశానికి "వెస్ట్రన్ డిస్టబెన్స్" ఉపశమనం:

మరోవైపు, వెస్ట్రన్ డిస్టబెన్స్‌గా పిలిచే వాతావరణ వ్యవస్థ ప్రభావంతో జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, పశ్చిమ రాజస్థాన్‌లలో రాబోయే రెండు మూడు రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆయా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

"వెస్ట్రన్ డిస్టబెన్స్" అనేవి హిమాలయ ప్రాంతం నుండి ఉద్భవించే పశ్చిమ గాలుల వ్యవస్థలు, ఇవి శీతాకాలంలో హిమపాతాన్ని మరియు వేసవిలో వర్షపాతాన్ని కలుగజేస్తాయి. ఈ సంవత్సరం, ఇవి రుతుపవనాల లోటును పాక్షికంగా భర్తీ చేయగలవు.

జూలై 18–25 కీలకం:

జూలై 18 నుంచి 25 మధ్య కాలాన్ని వాతావరణ నిపుణులు చాలా కీలకంగా భావిస్తారు. ఈ సమయంలో బంగాళాఖాతంలో అల్పపీడన వ్యవస్థలు బలపడితే మధ్య భారత్, ఉత్తర భారత్, గుజరాత్, రాజస్థాన్ వంటి ప్రాంతాల్లో మంచి వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఒక వేళ ఈ వాతావరణ వ్యవస్థలు బలహీనపడినా, దిశ మార్చుకున్నా వర్షాభావ పరిస్థితులు కొనసాగవచ్చని నిపుణులు చెబుతున్నారు. దీంతో ఐఎండీ ఈ పరిస్థితుల్ని జాగ్రత్తగా పర్యవేక్షిస్తోంది.

# మాదక ద్రవ్యాల నిర్మూలనపై వ్యాసరచన పోటీలు

**ముఖ్య అతిథిగా పాల్గొన్న కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి**

**మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఏసీపీ సూచన**

**ఆసక్తిగా పాల్గొన్న ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన 500 మంది విద్యార్థులు**

తెలుగు గళం న్యూస్ హనుమకొండ, జూలై 12








వింగ్స్ ఆఫ్ ఫైర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో "మాదక ద్రవ్యాల నిర్మూలన" అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధికి చెందిన సుమారు 500 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించి, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని, మంచి అలవాట్లు అలవరచుకొని బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో మాదక ద్రవ్యాలపై అవగాహన పెంపొందించడం, వాటి నిర్మూలనకు యువతను భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వింగ్స్ ఆఫ్ ఫైర్ ఫౌండేషన్ చైర్మన్ మహమ్మద్ యాకుబ్ పాషా తెలిపారు. సమాజంలో మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాజేందర్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి

తెలుగు గళం ఆత్మకూరు/ జులై 12



ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన హౌజ్ బుజుర్గు గ్రామానికి చెందిన తాళ్లపెల్లి రాజేందర్ కుటుంబాన్ని పరకాల మాజీ శాసనసభ్యులు శ్రీ చల్ల ధర్మారెడ్డి గారు పరామర్శించారు. అనంతరం తీవ్ర శోకసముద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా చల్ల ధర్మారెడ్డి గారు మాట్లాడుతూ.. రాజేందర్ అకాల మరణం ఆ కుటుంబానికి తీరని లోటని, వారి కుటుంబానికి తాము ఎల్లవేళలా తోడు ఉంటామని భరోసా ఇచ్చారు. ఏ కష్టం వచ్చినా ఆదుకుంటామని సముదాయించారు. బాధిత కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆయన, వారికి తక్షణ సాయంగా నగదు రూపంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంట స్థానిక బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇంటింటి సర్వేలో అత్యుత్తమ పనితీరు

**జమాల్‌పురం బూత్ స్థాయి అధికారి బండి వంశీని సన్మానించిన శాసనసభ్యులు కే.ఆర్. నాగరాజు**

తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/జూలై 12




వరంగల్ జిల్లా:పర్వతగిరి:ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా జమాల్‌పురం గ్రామంలో 90 శాతానికి పైగా ఇంటింటి సర్వే పూర్తి చేసిన బూత్ స్థాయి అధికారి బండి వంశీని శాసనసభ్యులు కే.ఆర్. నాగరాజు సన్మానించారు.ఈ కార్యక్రమం పర్వతగిరిలోని ఎస్.ఆర్.ఆర్. తోటలో జమాల్‌పురం గ్రామ సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్ సమక్షంలో జరిగింది.ఈ సందర్భంగా శాసనసభ్యులు కే.ఆర్. నాగరాజు బండి వంశీని శాలువాతో సత్కరించి అభినందించారు. గ్రామంలో ప్రతి ఇంటిని బాధ్యతగా సర్వే చేసినందుకు ఆయన వంశీ కృషిని కొనియాడారు.ఈ అవకాశం కల్పించిన సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్ కి,తనను గుర్తించి సన్మానించిన శాసనసభ్యులకు బండి వంశీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేవాదులే ఉమ్మడి వరంగల్‌కు వరప్రదాయిని

**రైతులకు 15 రోజుల్లో కాలువల ద్వారా సాగునీరు-కడియం శ్రీహరి**

**నెల రోజుల పాటు నిరంతరాయంగా దేవాదుల పంపింగ్**

**వర్షాభావ పరిస్థితుల్లో ఆన్-ఆఫ్ పద్ధతిలో సాగు చేయాలని రైతులకు సూచన**

**3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చర్యలు**

తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్, జూలై 12







ఉమ్మడి వరంగల్ జిల్లాకు దేవాదుల ఎత్తిపోతల పథకం వరప్రదాయినిగా మారిందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.2003లో తాను నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభించిన దేవాదుల పథకం నేడు మహా వృక్షంగా ఎదిగి లక్షలాది ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందిస్తోందని పేర్కొన్నారు.ఆదివారం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని ధర్మసాగర్ రిజర్వాయర్‌కు గోదావరి ఎత్తిపోతల పథకం ద్వారా జరుగుతున్న నీటి పంపింగ్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం పంపుల పనితీరు, ప్రస్తుతం నడుస్తున్న మోటార్లు, ఇంకా ప్రారంభించాల్సిన పంపులు, చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ, దేవాదుల పథకం ప్రారంభం నుంచి పూర్తి అయ్యే వరకు ప్రత్యక్ష రాజకీయాల్లో భాగస్వామిగా ఉండడం తన అదృష్టమని అన్నారు.తన రాజకీయ జీవితంలో అత్యంత సంతృప్తిని ఇచ్చిన ప్రాజెక్టు కూడా దేవాదులేనని పేర్కొన్నారు.రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు నీటిని పొదుపుగా వినియోగిస్తూ ఆన్-ఆఫ్ విధానంలో సాగు చేపట్టాలని సూచించారు.పరిస్థితిని అర్థం చేసుకుని ప్రభుత్వానికి, అధికారులకు రైతులు సహకరించాలని కోరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దేవాదుల పథకంపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం సమీక్షిస్తున్నారని తెలిపారు. నేటి నుంచి నెల రోజుల పాటు దేవాదుల పథకంలోని అన్ని దశల ద్వారా నిరంతరాయంగా పంపింగ్ జరుగుతుందని వెల్లడించారు.ఈ నెలలో ధర్మసాగర్, స్టేషన్ ఘనపూర్, నవాబ్‌పేట, అశ్వరావుపల్లి, చిటకోడూరు, బొమ్మకూరు రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపేలా కార్యాచరణ సిద్ధం చేశామని చెప్పారు.రైతులకు 15 రోజుల్లో కాలువల ద్వారా సాగునీరు అందిస్తామని, ప్రస్తుతం చేపడుతున్న పంపింగ్ ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఈ సుధీర్, ఎస్ఈ సీతారాం, జనగామ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ అధికారులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ప్రీ ప్రాథమిక పాఠశాలల కొలువులు"

**56 మందికి నియామక ఉత్తర్వులు"**

**ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ చేతుల మీదుగా జాయినింగ్ ఆర్డర్ల పంపిణీ"**

సత్తుపల్లి,ఆర్ సి,జూలై 12(తెలుగుగళం): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రీ ప్రాథమిక విద్యా బలోపేత కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 28 మంది బోధకులు (శిక్షకులు), 28 మంది ఆయాలకు మొత్తం 56 మందికి నియామక ఉత్తర్వులను ఆదివారం సత్తుపల్లి ఎమ్మెల్యే శిబిర కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు.



సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాల్లోని 28 ప్రభుత్వ ప్రీ ప్రాథమిక పాఠశాలలకు ఈ నియామకాలు చేపట్టినట్లు తెలిపారు.


ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

**చిన్నారుల భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి**

నియామక ఉత్తర్వులు పొందిన శిక్షకులు, ఆయాలకు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. చిన్నారులను ప్రేమగా చూసుకుంటూ ఆటలు, పాటల ద్వారా బోధన అందించాలని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, భద్రత, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆహార పంపిణీని స్వయంగా పర్యవేక్షించాలని కోరారు. తమ సేవలతో సత్తుపల్లి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి రూ.171.82 కోట్లతో 8 ఆర్‌అండ్‌బీ హ్యామ్ రోడ్లు

**-- శంకుస్థాపనలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి**




తెలుగు గళం న్యూస్ ఆలేరు, జూలై 12

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం వంగపల్లి వద్ద నిర్వహించిన యాదాద్రి సర్కిల్ ఫేజ్--1 ఆర్‌అండ్‌బీ హ్యామ్ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు.ఆర్‌అండ్‌బీ శాఖ ఫేజ్--1 హ్యామ్ రోడ్ల ప్రాజెక్టు కింద స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి మొత్తం రూ.171.82 కోట్లతో ఎనిమిది రోడ్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు.ఇందులో భాగంగా ఆదివారం రూ.116.94 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు ప్రధాన రోడ్ల అభివృద్ధి, విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు.శంకుస్థాపన చేసిన రోడ్లలో చిన్నపెండ్యాల--తరిగొప్పుల రోడ్డుకు రూ.46.03 కోట్లు, నెల్లుట్ల--నాంచారిమడూర్ రోడ్డుకు రూ.13.20 కోట్లు, స్టేషన్ ఘనపూర్--వర్ధన్నపేట రోడ్డుకు రూ.40.77 కోట్లు, రఘునాథపల్లి--కంచనపల్లి రోడ్డుకు రూ.16.94 కోట్లు కేటాయించారు. ఈ రోడ్లను ఆధునిక ప్రమాణాలతో అభివృద్ధి చేసి వెడల్పు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, తొలి దశలోనే స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి రూ.171.82 కోట్లతో ఎనిమిది రోడ్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చేపట్టిన నాలుగు రోడ్ల నిర్మాణ పనులను ఏడాదిలోపు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అనంతగిరిలో ట్రెక్కింగ్‌కు వెళ్లి హైదరాబాద్ మహిళ మృతి



వికారాబాద్,తెలుగు గళం: ట్రెక్కింగ్‌కు వెళ్లి మహిళ మృతిచెందిన ఘటన వికారాబాద్ జిల్లా అనంతగిరిలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లిన ప్రియాంక మోల్ (47).. ట్రెక్కింగ్ చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధరించారు. హైదరాబాద్‌కు చెందిన ఆమె ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నారు.

స్థానికులు, మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వారాంతపు సెలవు కావడంతో హైదరాబాద్‌లోని కంచన్‌బాగ్‌కు చెందిన ప్రియాంక మోల్, మరో ముగ్గురు కుటుంబసభ్యులు విహారయాత్ర కోసం ఆదివారం ఉదయం అనంతగిరి అటవీ ప్రాంతానికి చేరుకున్నారు. తొలుత నందిఘాట్ పరిసరాల్లో తిరిగారు. అనంతరం ట్రెక్కింగ్ చేస్తూ వ్యూపాయింట్ దగ్గరకి వెళ్లి అనంతగిరి అటవీ ప్రాంతాన్ని తిలకించారు. ఈ క్రమంలో ప్రియాంక మోల్ తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలిపోయారు.

ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను నాలుగు కి.మీ దూరంలో ఉన్న వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. ప్రియాంక గుండెపోటుతో మృతిచెందినట్లు తెలిపారు. అప్పటి వరకు తమతో సరదాగా గడిపిన ప్రియాంక మోల్ విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

# అర్హుల పేర్లు తొలగిపోకుండా జాగ్రత్త వహించాలి:శాసనసభ్యులు కే.ఆర్.నాగరాజు

**ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి**



తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/జూలై 12

వరంగల్ జిల్లా:పర్వతగిరి: వర్ధన్నపేట నియోజకవర్గంలోని బూత్ స్థాయి అధికారులు, బాధ్యులు, ముఖ్య నాయకులతో పర్వతగిరి మండల కేంద్రంలోని జె.ఆర్.ఆర్. కళ్యాణ మండపంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు, విశ్రాంత పోలీసు అధికారి కే.ఆర్. నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై కీలక సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. బూత్ స్థాయి అధికారులు పూర్తి సమయం కేటాయించి ఓటర్ల హక్కులను కాపాడాలని పిలుపునిచ్చారు.ఈ ప్రక్రియలో అర్హులైన ఓటర్లను జాబితాలో చేర్చడం, అనర్హులను తొలగించడం, అవసరమైన మార్పులు, చేర్పులు చేసి ఖచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించాలన్నారు.ప్రతి ఓటరు తప్పనిసరిగా సవరణ కార్యక్రమంలో పాల్గొని లెక్కింపు పత్రం నింపేలా బూత్ ఏజెంట్లు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా బూత్ ఏజెంట్లకు సవరణ కిట్లను అందజేశారు.అనంతరం పర్వతగిరి మండల అధ్యక్షురాలిగా నూతనంగా ఎన్నికైన ఇస్లావత్ సావిత్రి కి శాసనసభ్యులు నియామక పత్రాన్ని అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు.మండల అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి, జిల్లా ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు, పర్వతగిరి సర్పంచ్ శంకర్, సర్పంచుల సంఘ అధ్యక్షులు వెంకటేశ్వర రావు, ఎనుమాముల మార్కెట్ సంచాలకులు గౌడుగు బిక్షపతి, చౌటుపల్లి సహకార సంఘ అధ్యక్షులు గొర్రె దేవేందర్, పర్వతగిరి గ్రామశాఖ అధ్యక్షులు కుసుం రామచంద్రు, మండల ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలుతదితరులు.పాల్గొన్నారు.

# ధర్మసాగర్‌లో జన విజ్ఞాన వేదిక మండల మహాసభ..

**శాస్త్రీయ దృక్పథంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమన్న నిపుణులు**

**ముప్పారంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో మండల మహాసభ**

**శాస్త్రీయ దృక్పథం, హేతుబద్ధ ఆలోచనతోనే సమస్యలకు పరిష్కారమని వక్తల సూచన**

**జన విజ్ఞాన వేదిక నూతన మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక**






తెలుగు గళం న్యూస్ ధర్మసాగర్, జూలై 12

జన విజ్ఞాన వేదిక ధర్మసాగర్ మండల మహాసభ ఆదివారం ముప్పారంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ప్రధానోపాధ్యాయురాలు మాధవి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ మహాసభలో శాస్త్రీయ దృక్పథం, పర్యావరణ పరిరక్షణ, మూఢనమ్మకాల నిర్మూలన, రాజ్యాంగ విలువల ప్రచారంపై పలువురు ప్రముఖులు తమ అభిప్రాయాలు వెల్లడించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్వ శిక్ష హనుమకొండ జిల్లా సెక్టోరియల్ అధికారి సునీత మాట్లాడుతూ, మానవజాతి ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు శాస్త్రీయ దృక్పథం, హేతుబద్ధ ఆలోచన, విజ్ఞానపూర్వక కార్యాచరణ ద్వారానే శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు.విద్యార్థులు, యువత ప్రశ్నించే స్వభావాన్ని పెంపొందించుకుని మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని సూచించారు.ప్రధాన వక్తగా పాల్గొన్న ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ డా. వి. రామ "శాస్త్ర సాంకేతికత -- గతం, వర్తమానం, భవిష్యత్తు" అంశంపై ప్రసంగిస్తూ, శాస్త్ర సాంకేతిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ సమాజంలో మూఢనమ్మకాలు కూడా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లో విస్తృతంగా వ్యాప్తి చేయడం ద్వారానే విజ్ఞాన ఫలాలు ప్రతి ఇంటికీ చేరుతాయని, శాస్త్రీయ సమాజ నిర్మాణంతోనే దేశ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.విశ్రాంత జిల్లా అటవీ అధికారి పురుషోత్తం మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు.భావితరాలకు సురక్షితమైన భూమిని అందించేందుకు సహజ వనరులను కాపాడాలని పిలుపునిచ్చారు.అనంతరం జరిగిన ప్రతినిధుల సమావేశంలో సురేష్ గత రెండేళ్లలో ధర్మసాగర్ మండలంలో నిర్వహించిన జన విజ్ఞాన వేదిక కార్యక్రమాల నివేదికను సమర్పించారు.తెలంగాణ రాష్ట్ర పర్యావరణ ఉపసంఘ సభ్యులు కె.బి. ధర్మ ప్రకాశ్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించి నూతన మండల కమిటీ ఎన్నికలను నిర్వహించారు. రానున్న రెండేళ్ల కాలానికి సురేష్ అధ్యక్షుడిగా, రామకృష్ణ కార్యదర్శిగా, కిరణ్ కోశాధికారిగా, సుధీర్, మాధవి తదితరులు కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.నూతన కమిటీ సభ్యులు శాస్త్రీయ దృక్పథ వికాసం, పర్యావరణ పరిరక్షణ, మూఢనమ్మకాల నిర్మూలన, రాజ్యాంగ విలువల ప్రచారం, విజ్ఞాన వ్యాప్తి కార్యక్రమాలను గ్రామస్థాయిలో మరింత విస్తృతంగా నిర్వహించి జన విజ్ఞాన వేదిక ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యావేత్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో ఎమ్మెల్యే రాగమయి"



సత్తుపల్లి/ వేంసూరు, జూలై12 (తెలుగు గళం) న్యూస్: సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలంలోని కందుకూరు గ్రామంలో బూరుగు ప్రవళిక, పృథ్వి దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆదివారం హాజరయ్యారు. నూతన గృహంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ గృహాల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో: జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పుచ్చకాయల సోమిరెడ్డి, వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి, కందుకూరు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెన్నారావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గొర్ల వెంకటప్పరెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు గొర్ల సంజీవరెడ్డి, సీనియర్ నాయకులు వెల్ది జగన్మోహన్ రావు, బూరుగు రవి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వేంసూరు మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పోరాటాలతోనే రైతాంగ సమస్యలకు పరిష్కారం- భూక్యా చందు నాయక్

**దేవాదుల ద్వారా గోదావరి జలాలను జనగామకు అందించాలని డిమాండ్**

**జూలై 15, 16న గ్రామ పంచాయతీల ఎదుట రైతాంగ నిరసనలు**

**మరిగడి గ్రామంలో నిరసన పోస్టర్ ఆవిష్కరణ**



తెలుగు గళం న్యూస్ జనగామ, జూలై 12

దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను లిఫ్టింగ్ చేసి జనగామ జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు, కుంటలను తక్షణమే నింపి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ మేరకు జూలై 15, 16 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే రైతాంగ నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని రైతులు, ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మరిగడి గ్రామంలో నిరసన పోస్టర్‌ను ఆవిష్కరించారు.కార్యక్రమానికి గ్రామ కార్యదర్శి కాసాని మల్లేష్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా భూక్యా చందు నాయక్ మాట్లాడుతూ, ఒకప్పుడు జనగామ ప్రాంతం తీవ్ర కరువు ప్రాంతంగా ఉండేదని, రైతాంగ పోరాటాల ఫలితంగానే దేవాదుల ప్రాజెక్టు నిర్మాణం జరిగిందన్నారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం గోదావరి జలాలను దేవాదుల ద్వారా జిల్లాకు అందించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు.ఒకవైపు విలువైన గోదావరి జలాలు సముద్రంలో కలుస్తుండగా, మరోవైపు జనగామ జిల్లాలో రైతులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు లేక భూగర్భ జలాలు అడుగంటిపోయాయని, బోరు బావులు ఎండిపోవడంతో వరి, మొక్కజొన్నతో పాటు ఇతర పంటలు కూడా ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వం నిర్దేశించిన సాగు లక్ష్యాలకు విరుద్ధంగా సాగు విస్తీర్ణం తగ్గిపోయిందని, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం కూడా ఆశించిన స్థాయిలో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలను సూచించడం మాత్రమే కాకుండా వాటికి అవసరమైన నీటిని కూడా ప్రభుత్వం అందించాల్సిన బాధ్యత ఉందన్నారు.దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను లిఫ్టింగ్ చేసి జనగామ జిల్లాలోని అన్ని రిజర్వాయర్లు, చెరువులు, కుంటలను నింపడంతో పాటు సాగు, తాగునీటి అవసరాలను తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జూలై 15, 16 తేదీల్లో గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట జరిగే నిరసన కార్యక్రమాల్లో రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని భూక్యా చందు నాయక్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు బోడ రాములు, మండల నాయకుడు కూరాకుల శ్రీను, గూగులోత్ రమేష్, గూగులోత్ రవి, భూక్యా దేవోజీ, పెద్దతండా మాజీ ఉప సర్పంచ్ గూగులోత్ కవిత, గూగులోత్ లక్ష్మీ, గూగులోత్ మల్లమ్మ, పద్మతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ.. బస్ షెల్టర్ ప్రారంభం"

**కందుకూరులో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్"**



సత్తుపల్లి/ వేంసూరు, జూలై 12(తెలుగుగళం) న్యూస్: సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలంలోని కందుకూరు గ్రామంలో స్వర్గీయ తెలగారపు మల్లయ్య మాస్టర్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు విజయ్ బాబు, కుటుంబ సభ్యులు, రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం గ్రామ బస్టాండ్ బస్ షెల్టర్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ, బహుజన పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ చరిత్ర నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆమె ధైర్యసాహసాలు, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో: జాతీయ బీసీ సంఘం ఖమ్మంజిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, చాకలి ఐలమ్మ ముని మనవరాలు సంధ్య ఐలమ్మ, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి సోమిరెడ్డి, వేంసూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, రజక సంఘం అధ్యక్షుడు, రజక సంఘం నాయకులు, కందుకూరు కాంగ్రెస్ అధ్యక్షుడు చెన్నారావు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు వెంకటప్ప రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు గొర్ల సంజీవరెడ్డి, సీనియర్ నాయకులు వెల్ది జగన్మోహన్ రావు, బూరుగు రవి, విరివాడ భూషణం, అపర్ణ, సాయి శ్రీను, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి ఏరియా ఆసుపత్రిలో సీపీఎం జిల్లా నేతల పరిశీలన"

**శాశ్వత వైద్యులను నియమించాలని డిమాండ్"**

**వైద్యుల కొరతతో తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్న రోగులు: మోరంపూడి పాండు రంగారావు(సీపీఎం జిల్లా కమిటి సభ్యులు)**



సత్తుపల్లి,ఆర్ సి,జూలై12(తెలుగుగళం) న్యూస్ : ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను వెంటనే భర్తీ చేసి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం పార్టీ నాయకులతో కలిసి ఏరియా ఆసుపత్రిని పరిశీలించిన వారు మాట్లాడుతూ, నూతనంగా నిర్మించిన 100 పడకల ఆసుపత్రిలో 59 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం కేవలం 12 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని, వారిలో ఏడుగురు మాత్రమే శాశ్వత వైద్యులని తెలిపారు. 30 మంది సిబ్బంది నర్సులు ఉండాల్సి ఉండగా 10 మంది మాత్రమే, పరిశుభ్రత సిబ్బంది కూడా తీవ్ర కొరతలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కోట్ల రూపాయల వ్యయంతో ఆసుపత్రి నిర్మించినా అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు నాణ్యమైన వైద్య సేవలకు దూరమవుతున్నారని విమర్శించారు.ఈ ఆసుపత్రికి ఆంధ్రప్రదేశ్‌తో పాటు అశ్వరావుపేట,దమ్మపేట, ములకలపల్లి,పెనుబల్లి, అన్నపురెడ్డిపల్లి,వేంసూరు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో రోగులు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే శాశ్వత వైద్యులను నియమించి అత్యవసర వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో: సీపీఐ(ఎం) సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, డివిజన్ కమిటీ సభ్యులు రావుల రాజబాబు, సప్పిడి భాస్కర్, చావా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి




నర్సంపేట,తెలుగు గళం : మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట మండలంలోని లక్నేపల్లి, పాత ముగ్దుంపురం గ్రామాల్లో రూ.10 లక్షల చొప్పున నిధులతో మహిళా సంఘాల భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. మహిళలకు వడ్డీ లేని బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తూ, స్వయం ఉపాధి అవకాశాలను మరింత విస్తరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్, సర్పంచులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మల చొరవే: నెల్లూరి రాకేశ్"

**గోదావరి జలాలు రాకతో రైతుల మోములో ఆనందం"**

**నేడు కుంచపర్తి లో పూజలు చేయనున్న మట్టా"**



సత్తుపల్లి/ వేంసూరు, జూలై 12(తెలుగు గళం) న్యూస్: గోదావరి జలాలు రాకతో రైతుల మోములో ఆనందం వ్యక్తం అవుతుంది.సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలశీలో గల కాకర్ల మేజర్ కింద గల ఎర్రసానివారి బంజర గ్రామ పంట చేల కాలువకు గోదావరి జలాలు ఆదివారం వచ్చాయి.అట్టి గోదావరి జలాలు మండలంలోని తెలంగాణ బోర్డర్ లోని కుంచపర్తి గ్రామం నుండి గల నాగార్జున సాగర్ కాలువ రెగ్యులేటర్ వరకు వెళ్లనున్నాయి. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో సాగునీరు వచ్చాయని పలువురు రైతులు నెల్లూరి రాకేశ్, తుంబూరు రామిరెడ్డి లు తెలిపారు.సోమవారం అనగా నేడు ఉదయం 9 గంటలకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ కుంచపర్తి గ్రామం వచ్చి గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు చేయనున్నట్లు నెల్లూరి రాకేశ్ ఆదివారం మీడియాకు వెల్లడించారు.భారీ సంఖ్యలో రైతులు,అభిమానులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# అమరజ్యోతి భవనంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమీక్ష

**హాజరైన మాజీ ఎంపీ ఆచార్య అజ్మీర సీతారామ్ నాయక్**



తెలుగు గళం న్యూస్ హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను, జీవితాలను పణంగా పెట్టిన ఉద్యమకారుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి గౌరవం, హక్కుల పరిరక్షణను కాపాడటం రాష్ట్ర ప్రభుత్వం యొక్క ప్రాథమిక బాధ్యత అని మాజీ పార్లమెంట్ సభ్యులు, తెలంగాణ జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఆచార్య అజ్మీర సీతారామ్ నాయక్ స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అమరజ్యోతి భవనంలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం,సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. సీనియర్ నాయకులు శ్రీ కే. కేశవరావు అధ్యక్షతన, వారి నాయకత్వంలో సాగిన ఈ సుదీర్ఘ సమావేశానికి ఆచార్య అజ్మీర సీతారామ్ నాయక్ ప్రత్యేకంగా హాజరై తెలంగాణ జేఏసీ స్టీరింగ్ కమిటీ తరఫున పలు కీలక ప్రతిపాదనలను తెరపైకి తెచ్చారు.ఈ సందర్భంగా ఆచార్య అజ్మీర సీతారామ్ నాయక్ సుదీర్ఘంగా మాట్లాడుతూ, సుదీర్ఘ కాలం పాటు సాగిన మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని, లాఠీ దెబ్బలు తిని, జైలు జీవితం గడిపిన ఎంతో మంది నిరుపేద ఉద్యమకారుల సేవలను ఇప్పటికైనా సముచితంగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు.ఇందుకోసం ప్రభుత్వం ఒక స్పష్టమైన,సమగ్రమైన విధానాన్ని (పాలసీని) రూపొందించాలని డిమాండ్ చేశారు.అర్హులైన ప్రతి ఉద్యమకారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా,వారి కుటుంబాలకు సామాజిక భద్రతతో పాటు ఉచిత వైద్య, విద్యా సదుపాయాలు కల్పించేలా చేపట్టవలసిన తక్షణ చర్యలపై ఆయన కమిటీకి అత్యంత విలువైన సలహాలు, సూచనలు అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నిజమైన ఉద్యమకారుల వివరాలను శాస్త్రీయంగా సేకరించి, వారికి తగిన గుర్తింపు కార్డులు ఇవ్వడం ద్వారానే వారి ఆత్మగౌరవాన్ని కాపాడగలమని వివరించారు. ఈ సమావేశంలో ప్రతిపాదించిన అంశాలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఉద్యమకారుల సంక్షేమానికి ఉమ్మడిగా కృషి చేస్తామని ఈ సందర్భంగా నాయకత్వం స్పష్టం చేసింది. ఈ సమావేశంలో వివిధ జిల్లాల నుండి వచ్చిన ఉద్యమకారుల సంఘాల ప్రతినిధులు, జేఏసీ ముఖ్య నేతలు ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.